ఇది 'ఎడ్యుకేషన్ ఎమర్జెన్సీ'

యుద్ధాలను ఆపినట్టు చెప్తున్న మోదీ.. పేపర్ లీకులను ఆపలేరా?

- 'లీక్ పే స్పీక్' ఎప్పుడు పెడతారు?
- దేశంలో పరీక్షల వ్యవస్థ కుప్పకూలింది
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి
- పేపర్ లీకులపై కేంద్రంపై విపక్షాల ఆగ్రహం

న్యూఢిల్లీ, జూన్ 20: నీట్‌లో అక్రమాల ఆరోపణలతో 24 లక్షల మంది విద్యార్థుల భవిత ఆందోళనలో ఉన్న వేళ, ఇవే అక్రమాల ఆరోపణలతో యూజీసీ–నెట్ పరీక్షనూ రద్దు చేయడం పట్ల విపక్ష పార్టీలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఎన్డీయే ప్రభుత్వం విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తున్నదని మండిపడ్డాయి. దేశంలో 'ఎడ్యుకేషన్ ఎమర్జెన్సీ' పరిస్థితులు తలెత్తాయని ఆరోపించాయి. ఈ విషయమై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ఉక్రెయిన్–రష్యా, ఇజ్రాయెల్ – గాజా యుద్ధాలను ఆపారని చెప్తున్న మోదీ పేపర్ లీకేజీలను ఆపలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. పేపర్ లీకులను ఆపాలని మోదీ అనుకోవడం లేదా అని ప్రశ్నించారు. ఏదైనా ఇష్టానుసారంగా చేయడానికి వీలు లేదని, ఒక పరీక్షకు వర్తించిన నియమాలు మరో పరీక్షకు కూడా వర్తించాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రతీయేటా 'పరీక్ష పే చర్చ' పేరుతో ప్రధాని మోదీ పెద్ద తమాషా చేస్తారని, మరోవైపు ఆయన ప్రభుత్వం లీకులు, అక్రమాలు లేకుండా పరీక్షలు నిర్వహించలేకపోతున్నదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. రోజుకో ప్రశ్నాపత్రం లీక్ అవుతుండటం ఏ రకమైన 'పరీక్ష పే చర్చ' అని ప్రశ్నించారు. ఇప్పుడు ప్రధానమంత్రి 'లీక్ పే స్పీక్' నిర్వహించి మాట్లాడాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం దేశ విద్యా, నియామకాల వ్యవస్థను నాశనం చేసిందనేది నీట్, యూజీసీ–నెట్,

సీయూఈటీ పరీక్షలు బహిర్గతం చేశాయన్నారు. ఉద్యోగ నియామకాలు అన్నింటికీ ఒకే పరీక్ష పెడతామని చెప్తూ మోదీ చెప్పిన నేషనల్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ(ఎన్ఆర్ఏ) నాలుగేళ్లుగా ఒక్క పరీక్షను నిర్వహించలేదని పేర్కొన్నారు.

పేపర్ మాఫియా రిగ్గింగ్: అఖిలేశ్

పరీక్షల నిర్వహణలో అసమర్థత పునరావృతం కావడం విద్యార్థులను అనిశ్చితిలోకి నెట్టేస్తున్నదని, ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నదని, ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. బీజేపీ పాలనలో పేపర్ మాఫియా ఒకదాని తర్వాత ఒక పరీక్షను రిగ్గింగ్ చేస్తున్నదని, దేశానికి వ్యతిరేకంగా ఇది కుట్ర కావొచ్చని ఆయన అనుమానించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, ఎన్‌టీఏను రద్దు చేయాలని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి డిమాండ్ చేశారు. ఈ పరిస్థితిని శివసేన(ఉద్ధవ్) ఎంపీ ప్రియాంక చతుర్వేది.. 'ఎడ్యుకేషన్ ఎమర్జెన్సీ'తో పోల్చారు. పరీక్షల రద్దు ఈ సమస్యకు పరిష్కారం కాదని, కేంద్రం, ఎన్‌టీఏ జవాబుదారీతనంతో ఉండాలని ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే మాట్లాడుతూ... దేశంలో పరీక్షల వ్యవస్థ కుప్పకూలిందని, పేపర్ లీక్‌లతో పాటు అక్రమాలు హద్దుమీరిపోయాయని పేర్కొన్నారు. పనికిమాలిన ఎన్‌టీఏకు ఇందులో భాగస్వామ్యం ఉందని ఆరోపించారు. అసమర్థ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పూర్తిగా విఫలమైనా మరోసారి కొనసాగించారని, ఇదే రకంగా అశ్వినీ వైష్ణవ్‌ను రైల్వే మంత్రిగా కొనసాగించగా ఇటీవలే రైలు ప్రమాదం జరిగిందన్నారు. వీరిద్దరినీ మంత్రివర్గం నుంచి తొలగించాలని చేశారు. నెట్ పరీక్షను రద్దు చేయాల్సి వచ్చిందని, అవకతవకలకు సంబంధించిన ఆధారాలు ఉన్నందున నీట్‌ను కూడా రద్దు చేయాలని ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా డిమాండ్ చేశారు.

డార్క్‌నెట్ పేపర్!

› మొదటిపేజీ తరువాయి...

ధర్మేంద్ర ప్రధాన్ మీడియాతో మాట్లాడుతూ.. డార్క్‌నెట్‌లో ఉన్న ప్రశ్నాపత్రం అసలైన యూజీసీ–నెట్ ప్రశ్నాపత్రంతో సరిపోలుతున్నదని తెలిసిన వెంటనే పరీక్షను రద్దు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు.

ఎన్‌టీఏపై సమీక్షకు ఉన్నత స్థాయి కమిటీ

నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలనే డిమాండ్‌పై ఆయన స్పందిస్తూ.. నిర్దిష్ట ప్రాంతాలకు పరిమితమయ్యే అక్రమాల ప్రభావం నిజాయితీగా ఉత్తీర్ణత సాధించిన లక్షలాది మందిపై పడకూడదని పేర్కొన్నారు. మన వ్యవస్థలపై నమ్మకం ఉంచాలని, అక్రమాలు లేదా మాల్‌ప్రాక్టీస్‌లను తమ ప్రభుత్వం సహించదని పేర్కొన్నారు. ఎన్‌టీఏ పనితీరుపై సమీక్షకు త్వరలోనే ఉన్నత స్థాయి కమిటీని నియమించనున్నట్టు ప్రకటించారు. ఈ కమిటీ ఎన్‌టీఏ పనితీరు మెరుగయ్యేందుకు తగు సూచనలు చేస్తుందని తెలిపారు. ఈ అంశాన్ని రాజకీయం చేయొద్దని, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

నెట్ పరీక్షపై ఫిర్యాదులు రాలేదు: ఎన్‌టీఏ

యూజీసీ–నెట్ పరీక్షకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని విద్యాశాఖ సంయుక్త కార్యదర్శి గోవింద్ జైస్వాల్ తెలిపారు. అయితే, భద్రతా సంస్థల నుంచి తమకు అందిన సమాచారం.. పరీక్ష సమగ్రత లోపించిందనే విషయాన్ని సూచించిందని, విద్యార్థుల ప్రయోజనాలకు రక్షణ కల్పించేందుకు సుమోటోగా పరీక్షను రద్దు చేసినట్టు తెలిపారు. కాగా, ఈ విషయం ప్రస్తుతం సీబీఐ విచారణలో ఉన్నందున ఎలాంటి సమాచారం అందిందనే విషయాన్ని వెల్లడించలేమని తెలిపారు. నెట్ పరీక్ష కొత్త తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

పరీక్షకు ముందు రోజే పేపర్ అందింది!

- సమాధానాలను బట్టీ పట్టాం
- ఒప్పకున్న అరెస్టయిన విద్యార్థులు

పాట్నా, జూన్ 20: బీహార్‌లో నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీకి సంబంధించి కీలక అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో అరెస్టయిన నలుగురు నిందితులు పరీక్షకు ముందు రోజు రాత్రి పేపర్ లీక్ అయ్యిందని అంగీకరించారు. ఈ కేసులో బీహార్ పోలీసులు అనురాగ్ యాదవ్ అనే విద్యార్థిని, దానాపూర్ మున్సిపల్ కౌన్సిల్‌లో జూనియర్ ఇంజినీర్‌గా పని చేస్తున్న అతడి మామ సికందర్ ప్రసాద్ యదువేందు, నితీశ్ కుమార్, అమిత్ ఆనంద్ అరెస్టు అయ్యారు. పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలాల్లో వీరు కీలక విషయాలు వెల్లడించారు. పరీక్షకు ముందురోజు ప్రశ్నాపత్రం అందిందని, అందులోని ప్రశ్నలే తెల్లవారి పరీక్షలో అడిగినట్టు అంగీకరించారు. నీట్‌కు సిద్ధమవుతున్న తనను తన మామ సికందర్ పేపర్ లీకేజీ గురించి చెప్పి ఇంటికి పిలిచారని చెప్పాడు. ముందురోజు రాత్రి తనకు ప్రశ్నాపత్రం ఇచ్చారని, వాటికి సమాధానాలను బట్టీ పట్టించారని, అవే ప్రశ్నలు పరీక్షలో వచ్చాయని ఒప్పుకున్నాడు. మరో విద్యార్థి శివనందన్ కుమార్ కూడా ఇదే విషయాన్ని అంగీకరించాడు.

ఒక్కో విద్యార్థి నుంచి రూ.40 లక్షలు

ఏ పోటీ పరీక్ష ప్రశ్నాపత్రం అయినా లీక్ చేస్తామని, ఇందుకు ఒక్కో విద్యార్థికి రూ.30 – 32 లక్షలు అవుతుందని తనకు నితీశ్ కుమార్, అమిత్ ఆనంద్ చెప్పారని సికందర్ తన వాంగ్మూలంలో తెలిపాడు. తాను నలుగురు విద్యార్థులను రూ.40 లక్షల చొప్పున అడిగానని, జూన్ 4 రాత్రి వారిని వెంటబెట్టుకొని వెళ్లగా నితీశ్, అమిత్ పేపర్ ఇచ్చారని ఒప్పుకున్నాడు. మరునాడు వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు విద్యార్థుల అడ్మిట్ కార్డులతో తాను పట్టుబడినట్టు చెప్పాడు. అభిషేక్ అనే విద్యార్థి తండ్రి అవదేశ్.. తాను ప్రశ్నాపత్రం కోసం సికందర్‌కు రూ.40 లక్షలు ఇచ్చినట్టు ఒప్పుకోగా, ఇచ్చేందుకు అంగీకరించినట్టు ఆయుష్ రాజ్ అనే విద్యార్థి తండ్రి అఖిలేశ్ వాంగ్మూలం ఇచ్చాడు.

భగ్గుమన్న విద్యార్థిలోకం

- నీట్ అక్రమాలు, నెట్ రద్దుపై ఆగ్రహం
- దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఆందోళనలు
- నీట్ కూడా రద్దు చేయాలని డిమాండ్
- ధర్మేంద్రప్రధాన్ రాజీనామాకు పట్టు

నీట్, నెట్ పరీక్షల్లో అక్రమాలను నిరసిస్తూ ఢిల్లీలో విద్యార్థుల ఆందోళన

న్యూఢిల్లీ, జూన్ 20: నీట్ పరీక్షలో అక్రమాలపై ఒకవైపు ఆందోళనలు కొనసాగుతుండగా మరోవైపు నెట్ పరీక్షను రద్దు చేయడం పట్ల విద్యార్థిలోకం భగ్గుమన్నది. గురువారం ఉదయం ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఏ, ఎన్ఎస్‌యూఐ, డీఎస్ఎఫ్, కేవైఎస్ తదితర సంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీలోని విద్యాశాఖ కార్యాలయం, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇంటి ముందు పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగాయి. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని, నెట్ పరీక్షలో అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని పట్టుబట్టారు. పరీక్షల్లో అవకతవకతలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

పలువురు విద్యార్థుల అరెస్టు

ఆందోళన చేస్తున్న విద్యార్థులను పోలీసులు అడ్డుకున్నారు. 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. పేపర్ లీక్ అయ్యిందనే ఆరోపణల నేపథ్యంలో ఎన్‌టీఏను నిషేధించాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. అనేక అవకతవకలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలనే తమ డిమాండ్‌పై ఎన్‌టీఏ, విద్యాశాఖ స్పందించలేదని, ఇప్పుడు నెట్ పరీక్ష కూడా లీక్ కారణంగా రద్దు అయ్యిందన్నారు. ఎన్‌టీఏ మరోసారి విద్యార్థుల సమయాన్ని వృథా చేసిందని, ఈ సంస్థను పూర్తిగా రద్దు చేయాలని ఏఐఎస్ఏ డిమాండ్ చేసింది. ఆందోళన చేస్తున్న మహిళా విద్యార్థులపై పోలీసులు తీవ్రంగా దాడి చేశారని ఎస్ఎఫ్ఐ ఆరోపించింది.

యూజీసీ-నెట్ పేపర్ లీక్‌పై సీబీఐ ఎఫ్ఐఆర్

న్యూఢిల్లీ, జూన్ 20: యూజీసీ–నెట్ పేపర్ లీకేజీ కేసులో కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులపై సీబీఐ గురువారం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. కేంద్ర విద్యాశాఖ సూచన మేరకు ఈ కేసు నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు. జూనియర్ రీసెర్చి ఫెలోషిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీహెచ్‌డీలో ఎంపిక కోసం యూజీసీ–నెట్ 2024ను నేషనల్ టెస్ట్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో జూన్ 18న దేశ వ్యాప్తంగా రెండు షిఫ్టులలో నిర్వహించారు. అయితే దీనికి సంబంధించిన పరీక్ష పేపర్ అంతకు ముందు రోజే డార్క్‌నెట్‌లో ప్రత్యక్షమై 5–6 లక్షలకు అమ్మినట్టు నిర్ధారిత సమాచారం అందడంతో యూజీసీ ఆ పరీక్షను రద్దు చేసింది.

త్వరలో జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు: మోదీ

శ్రీనగర్, జూన్ 20: జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన సన్నాహాలు ప్రారంభమయ్యాయని, యూటీ నుంచి రాష్ట్ర హోదాకు మారే సమయం అతి దగ్గరలోనే ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. మూడోసారి ప్రధాని అయిన తర్వాత తొలిసారిగా కశ్మీర్ లోయను సందర్శించిన మోదీ గురువారం శ్రీనగర్‌లో రూ. 1,500 కోట్లతో చేపట్టే 84 అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఇటీవలి ఉగ్రవాద ఘటనలను ఆయన ప్రస్తావిస్తూ ఉగ్రవాదులకు తగిన రీతిలో సమాధానం చెబుతామని హెచ్చరించారు. లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక ఓటింగ్ నమోదు కావడానికి కృషి చేసిన ప్రజలను ఆయన ప్రశంసించారు.

లోక్‌సభ ప్రొటెం స్పీకర్‌గా భర్తృహరి మహతాబ్

26న లోక్‌సభ స్పీకర్ ఎన్నిక

న్యూఢిల్లీ, జూన్ 20: లోక్‌సభ ప్రొటెం స్పీకర్‌గా భర్తృహరి మహతాబ్‌ను నియమించినట్టు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు గురువారం వెల్లడించారు. ఏడుసార్లు ఎంపీగా చేసిన మహతాబ్ ప్రస్తుతం బీజేపీ సభ్యునిగా కటక్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయనను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రొటెం స్పీకర్‌గా నియమించినట్టు రిజిజు చెప్పారు. కొత్త ఎంపీలు ప్రొటెం స్పీకర్ ముందు ప్రమాణ స్వీకారం చేస్తారు. లోక్‌సభ తొలి సమావేశాలు జూన్ 24న ప్రారంభం కానుండగా, 24, 25 తేదీల్లో సభ్యులు ప్రమాణ స్వీకారం చేస్తారు. 26న లోక్‌సభ స్పీకర్ ఎన్నిక జరుగుతుంది.

ఈవీఎంలను వెరిఫికేషన్ చేయాలి

ఈసీకి పలువురు అభ్యర్థుల దరఖాస్తు

న్యూఢిల్లీ, జూన్ 20: జూన్ 4న ఎన్నికల ఫలితాల్ని వెలువరించిన ఈవీఎంలలో అవకతవకలు జరిగాయని అనుమానం వ్యక్తం చేస్తూ కొంతమంది అభ్యర్థులు కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించారు. 6 రాష్ట్రాల్లోని 8 లోక్‌సభ స్థానాల నుంచి బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన వారు సహా పలువురు అభ్యర్థులు వెరిఫికేషన్‌పై దరఖాస్తు చేశారు. అలాగే, ఆంధ్రప్రదేశ్, ఒడిశా అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి 3 స్థానాల్లోని 26 పోలింగ్ కేంద్రాల్లో వాడిన ఈవీఎంలపై వెరిఫికేషన్‌కు దరఖాస్తులు వచ్చాయి. అభ్యర్థులు వెరిఫికేషన్ కోరాలంటే ఒక్కో ఈవీఎం సెట్‌కు రూ.47,200 ఎన్నికల కమిషన్‌కు చెల్లించాల్సి ఉంటుంది.

కోల్‌కతా పోలీసులతో నాకు ముప్పు

బెంగాల్ గవర్నర్ ఆనంద బోస్

కోల్‌కతా, జూన్ 20: పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్ర గవర్నర్, అధికార తృణమూల్ కాంగ్రెస్‌కు మధ్య రాజకీయ పోరు మరో స్థాయికి చేరుకుంది. ఆ రాష్ట్ర గవర్నర్ సీవీ ఆనంద బోస్ తన భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్‌భవన్ వద్ద మమతా బెనర్జీ సర్కార్ మోహరించిన కోల్‌కతా పోలీసుల నుంచి తన భద్రతకు ముప్పు పొంచివుందని ఆరోపించారు. 'కోల్‌కతా పోలీసుల మోహరింపుతో నేను అభద్రతకు లోనవుతున్న విషయాన్ని బెంగాల్ సీఎం మమతా బెనర్జీకి తెలియజేశాను. అయితే ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాలేదు. ప్రస్తుతం విధుల్లో ఉన్న పోలీస్ అధికారి, అతడి సిబ్బంది నుంచి నా వ్యక్తిగత భద్రతకు ముప్పు ఉందనేందుకు, నా కారణాలు నాకున్నాయి' అని గవర్నర్ అన్నారు. గవర్నర్, రాజ్‌భవన్ అధికారుల కదలికలపై ప్రభుత్వం నిరంతరం నిఘా విధించిందని, పోలీసుల చర్యలు ప్రభుత్వం మద్దతుతో కొనసాగుతున్నాయని గవర్నర్ ఆరోపించారు. రాష్ట్ర పోలీస్ శాఖలో ఉన్నతాధికారులకు తెలియకుండా ఇదంతా జరగదు కదా? అని ఆయన సందేహం వ్యక్తం చేశారు.

కౌన్సెలింగ్ ఆపబోం

- నీట్‌పై సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- పరీక్ష రద్దు పిటిషన్లపై కేంద్రం, ఎన్టీఏకు నోటీసులు
- హైకోర్టుల్లో ప్రొసీడింగ్స్‌పై స్టే

న్యూఢిల్లీ, జూన్ 20: నీట్ యూజీ–2024 పరీక్షను రద్దు చేయాలని, అక్రమాలపై కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం కేంద్ర ప్రభుత్వం, ఎన్టీఏలకు నోటీసులు జారీచేసింది. పిటిషన్లపై స్పందన తెలియజేయాలని ఆదేశించింది. నీట్ వివాదంపై వివిధ హైకోర్టుల్లో పెండింగ్ ఉన్న పిటిషన్లపై ప్రొసీడింగ్స్‌పై స్టే విధించింది. అయితే నీట్ కౌన్సెలింగ్‌పై స్టే విధించలేమని మరోసారి స్పష్టం చేసింది. తదుపరి విచారణను న్యాయస్థానం జూలై 8కి వాయిదా వేసింది.

గత నెల 5న జరిగిన నీట్ పరీక్షను రద్దు చేయాలని 20 మంది అభ్యర్థులు పిటిషన్ వేశారు. కొత్త పరీక్ష నిర్వహించేలా ఎన్టీఏకు ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థుల తరపు న్యాయవాది ధీరజ్ సింగ్ న్యాయస్థానాన్ని కోరారు. నీట్ పరీక్షకు సంబంధించి పేపర్ లీక్, ఇతరత్రా అంశాలపై హైకోర్టుల్లో దాఖలైన పిటిషన్లన్నింటినీ సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలని కోరుతూ ఎన్టీఏ చేసిన అభ్యర్థనపై కూడాధర్మాసనం సంబంధిత కక్షిదారులకు నోటీసులు ఇచ్చింది.

నీట్ లీకేజీతో తేజస్వీకి సంబంధాలు: బీజేపీ

పాట్నా, జూన్ 20: నీట్ ప్రశ్నాపత్రం లీకేజీతో ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌కు సంబంధాలు ఉన్నాయని బీజేపీ ఆరోపించింది. ఈ కేసులో అరెస్టైన ప్రధాన నిందితుడు సికిందర్ ప్రసాద్ యద్వేందుకు తేజస్వీ సహచరులతో సన్నిహిత సంబంధాల ఉన్నాయని బీహార్ డిప్యూటీ సీఎం విజయ్ కుమార్ సిన్హా ఆరోపించారు. దీనిపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. తేజస్వీ సన్నిహితులు సికందర్ ప్రసాద్‌తో నిరంతరం సంప్రదింపులు చేశారని, ఇందుకు సంబంధించిన సందేశాలు తన వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాల్సి ఉన్నదన్నారు.

అన్‌వాంటెడ్ బిజినెస్ కాల్స్‌కు చెక్!

- ముసాయిదా మార్గదర్శకాలు విడుదల చేసిన కేంద్రం
- వచ్చే నెల 21 వరకు ప్రజాభిప్రాయం కోరిన ప్రభుత్వం

న్యూఢిల్లీ: అత్యవసరమైన పనిలో ఉండగా మన ఫోన్లకు వచ్చే అవసరం లేని ప్రమోషనల్ బిజినెస్ కాల్స్, సందేశాలు చికాకు తెప్పిస్తుంటాయి. ఒక్కోసారి విపరీతమైన కోపానికి కూడా దారితీస్తుంది. ఇలాంటి ఫోన్లు, మెసేజ్‌లకు త్వరలో చెక్ పడనున్నది. వీటి కట్టడికి సంబంధించి కేంద్ర వినియోగదారు వ్యవహారాల మంత్రిత్వ శాఖ గురువారం ముసాయిదా మార్గదర్శకాలు జారీచేసింది. ఈ నిబంధనలపై జూలై 21న ప్రజలు అభిప్రాయాలు తెలియజేసేందుకు అవకాశం కల్పించింది. టెలికం సంస్థలు, రెగ్యులేటర్లు, ఇతర సంబంధిత వాటాదారులతో సంప్రదింపుల అనంతరం కేంద్రం ఈ ముసాయిదా మార్గదర్శకాలు రూపొందించింది. వస్తువులు, సేవలకు సంబంధించిన కమ్యూనికేషన్‌ను 'బిజినెస్ కమ్యూనికేషన్'గా ముసాయిదా మార్గదర్శకాలు పేర్కొన్నాయి. అయితే ఇందులో నుంచి వ్యక్తిగత సంభాషణలను మినహాయించారు. ఫోన్ కాల్ గ్రహీత సమ్మతి, రిజిస్టర్డ్ ప్రాధాన్యత అనుగుణంగా లేకుండా వచ్చే కమ్యూనికేషన్‌ను బిజినెస్ కమ్యూనికేషన్‌గా పేర్కొన్నాయి. గ్రహీతలు విముఖత వ్యక్తం చేస్తున్నా అన్‌రిజిస్టర్డ్ నంబర్లు లేదా ఎస్ఎంఎస్ హెడర్లను వినియోగించడం, కాల్ చేయడం, కాలర్‌ను గుర్తుపట్టలేని వంటి పరిస్థితులు అనధికార కమ్యూనికేషన్ కిందకు వస్తాయని తెలిపింది. కమర్షియల్ సందేశాలకు సంబంధించి ట్రాయ్ రూల్స్‌ను ఉల్లంఘించే కమ్యూనికేషన్స్‌ను కూడా ప్రతిపాదనలు నిషేధించాయి.

లీకులే.. లీకులు!

- మోదీ హయాంలో పరీక్షలు అభాసుపాలు
- ఏడేండ్లలో 70కి పైగా ప్రశ్నాపత్రాల లీక్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): ఒకవైపు నీట్ ప్రశ్నాపత్రం లీకుల దుమారం కొనసాగుతుండగా, యూజీసీ నెట్ పేపరూ లీక్ కావడం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. దీంతో మోదీహయాంలో పరీక్షలు అభాసుపాలవుతున్నాయన్న విమర్శలు పెద్దయెత్తున వ్యక్తమవుతున్నాయి. దీన్ని ధ్రువపరుస్తూ.. గడిచిన ఏడేండ్లలో 70కి పైగా ఎగ్జామ్ పేపర్స్ లీకైనట్టు, దీంతో 1.5 కోట్ల మంది విద్యార్థుల జీవితంపై ప్రభావం పడినట్టు మీడియా నివేదికలు చెప్తున్నాయి. కేంద్రప్రభుత్వం ఆధీనంలోని ఏజెన్సీలు నిర్వహించే నీట్, నెట్, సీబీఎస్ఈ, ఎయిమ్స్ తదితర ఎగ్జామ్ పేపర్లు లీకవ్వడం గమనార్హం. ప్రధాని మోదీ స్వరాష్ట్రం గుజరాత్‌లో 2015–2023 మధ్య పేపర్ లీకులకు సంబంధించి 14 కేసులు నమోదయ్యాయి. బీజేపీపాలిత యూపీలో 2017–2022 మధ్య ఆరు పేపర్లు లీక్ అయినట్టు నివేదికలు చెబుతున్నాయి. ఇప్పుడు నీట్ పరీక్షలోనూ ఎన్డీయే పాలిత బీహార్‌లోనే అక్రమాలు బయటపడ్డాయి.

మోదీహయాంలో ప్రధాన పేపర్ లీకులు

2015: సీబీఎస్ఈ నిర్వహించిన ఆలిండియా ప్రీ–మెడికల్ అండ్ ప్రీ–డెంటల్ ఎంట్రెన్స్ టెస్ట్‌లో అవకతవకలు బయటపడ్డాయి. దీంతో ఈ పరీక్షను సుప్రీంకోర్టు రద్దు చేసింది.

2018: సీబీఎస్ఈ 10, 12 తరగతులకు సంబంధించి మ్యాథ్స్, ఎకనమిక్స్ పేపర్లు పరీక్షకు ముందే వాట్సాప్‌లో లీక్ అయ్యాయి.

2021: ఎగ్జామ్‌కు అరగంట ముందే నీట్ పేపర్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారడం సంచలనం సృష్టించింది. ఓ ఎగ్జామ్ సెంటర్ ఇంచార్జీ నిర్వాకం వల్లే ఇది జరిగినట్టు తేలింది.

2023: ఎయిమ్స్–నర్సు రిక్రూట్‌మెంట్ ఎగ్జామ్ పేపర్ సోషల్‌మీడియాలో ప్రత్యక్షమైంది. దీంతో ఎయిమ్స్ ఈ పరీక్షను తిరిగి నిర్వహించాల్సి వచ్చింది.

2024: ఎన్టీఏ నిర్వహించిన నీట్–యూజీ, యూజీసీ నిర్వహించిన నెట్ పేపర్లు లీకయ్యాయి. నెట్ పరీక్షను రద్దు చేసిన యూజీసీ పరీక్షను తిరిగి నిర్వహిస్తామన్నది. నీట్‌పై దుమారం కొనసాగుతున్నది.

బీహార్‌లో '65% కోటా' రద్దు

- రిజర్వేషన్ల పెంపు నిర్ణయాన్ని కొట్టేసిన పాట్నా హైకోర్టు
- నితీశ్ సర్కారుకు ఎదురుదెబ్బ
- కోర్టు తీర్పును సవాల్ చేస్తాం
- డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి

పాట్నా: బీహార్‌లో నితీశ్ కుమార్ ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లను 50 నుంచి 65 శాతానికి పెంచుతూ రాష్ట్ర సర్కార్ తీసుకొన్న నిర్ణయాన్ని పాట్నా హైకోర్టు గురువారం కొట్టివేసింది. ఈ పెంపు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్న న్యాయస్థానం.. 65 శాతం రిజర్వేషన్లను రద్దు చేస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కే వినోద్ చంద్రన్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం సంచలన తీర్పు వెలువరించింది. గత ఏడాది నవంబర్‌లో రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి ప్రభుత్వం చేసిన సవరణ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు ఈ ఏడాది మార్చిలో తీర్పును రిజర్వ్ చేయగా, తాజాగా రిజర్వేషన్లను రద్దు చేస్తూ తుది తీర్పునిచ్చింది. అయితే కోర్టు తీర్పును సవాల్ చేస్తామని డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి తెలిపారు. కులాల వారీగా జనాభా సంఖ్యను తేల్చేందుకు నితీశ్ కుమార్ ప్రభుత్వం గత ఏడాది కులగణన చేపట్టింది. ఓబీసీలు, ఈబీసీలు కలిపి రాష్ట్రంలో 63 శాతం వరకు ఉన్నట్టు తేలింది. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీలు కలిపి 21 శాతానికి పైగా ఉన్నట్టు వెల్లడైంది. కేంద్రం ప్రవేశపెట్టిన ఈడబ్ల్యూఎస్ కోటాతోనే రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు పెట్టిన 50 శాతం పరిమితి ఇప్పటికే దాటిపోయిందనే అభిప్రాయంతో.. బీహార్ ప్రభుత్వం కులగణన తర్వాత అసెంబ్లీలో రిజర్వేషన్ల చట్టాల సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. రిజర్వేషన్లను 50 నుంచి 65 శాతానికి పెంచుతూ తీసుకొచ్చిన బిల్లుకు సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ మేరకు రిజర్వేషన్ల కోటాను పెంచుతూ గత ఏడాది నవంబర్ 21న ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో రాష్ట్రంలో ఈడబ్ల్యూఎస్ 10 శాతం కోటాతో కలిపి రాష్ట్రంలో రిజర్వేషన్లు 75 శాతానికి చేరాయి.

కేజ్రీవాల్‌కు బెయిల్

- మంజూరు చేసిన ఢిల్లీ రౌస్ ఎవెన్యూ కోర్టు
- ఉత్తర్వులు 48 గంటలు నిలుపుదల చేయాలన్న ఈడీ అభ్యర్థన తిరస్కరణ
- నేడు జైలు నుంచి బయటకు
- ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేయనున్న ఈడీ

న్యూఢిల్లీ, జూన్ 20: మద్యం పాలసీ మనీ లాండరింగ్ కేసులో ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత కేజ్రీవాల్‌కు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. ఢిల్లీ హైకోర్టులో అప్పీల్‌కు వెళ్లేందుకు బెయిల్ ఉత్తర్వులపై 48 గంటలపాటు నిలుపుదల చేయాలన్న ఈడీ అభ్యర్థనను ప్రత్యేక జడ్జి నియయ్ బిందు తిరస్కరించారు. రూ.లక్ష వ్యక్తిగత బాండ్ పూచీకత్తుపై కేజ్రీవాల్‌ను విడుదల చేయాలని ఆదేశించారు. కేజ్రీవాల్ శుక్రవారం తీహార్ జైలు నుంచి విడుదల కానున్నారు. కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు ముందు జడ్జి షరతులు విధించారు. దర్యాప్తును అడ్డుకోకూడదని, సాక్ష్యులను ప్రభావితం చేయకూడదని స్పష్టం చేసింది. అవసరమైన సమయంలో కోర్టుకు హాజరుకావాలని, అదేవిధంగా దర్యాప్తునకు సహకరించాలని ఆదేశించారు. కాగా, కేజ్రీవాల్‌కు బెయిల్‌ను ఈడీ శుక్రవారం హైకోర్టులో సవాల్ చేసే అవకాశం ఉన్నది.

పక్కా కుట్రతో కేజ్రీవాల్‌ను ఇరికించారు!

కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లేవని ఆయన తరపు న్యాయవాది విక్రమ్ చౌదరి వాదించారు. పీఎంఎల్ఏ కింద దాఖలు చేసిన ఏ చార్జిషీట్‌లోనూ కేజ్రీవాల్ పేరు లేదని వాదించారు. 'ఈడీ ఒక స్వతంత్ర దర్యాప్తు సంస్థనా? లేక కొంత మంది రాజకీయ నేతల చేతుల్లో ఆడే సంస్థనా?' అని అన్నారు. అప్రూవర్ల స్టేట్‌మెంట్ల ఆధారంగా కేజ్రీవాల్‌ను ఇరికించారని కోర్టుకు తెలిపారు. అరెస్టు చేసిన కొంత మందికి బెయిల్ వచ్చేట్టు చేస్తామని ముందుగానే హామీ ఇచ్చారని వాదనలు కేజ్రీవాల్‌కు బెయిల్ నేపథ్యంలో ఆప్ నేతలు సంబరాలు చేసుకొన్నారు. కేజ్రీవాల్‌ను ఇరికించేందుకు రూపొందించిన ఫేక్ కేసు ఇది అని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ విమర్శించారు. సత్యం గెలిచిందని, కోర్టుల పట్ల విశ్వాసం ఉన్నదని పంజాబ్ సీఎం భగవంత్ మాన్ పోస్టు చేశారు.

హామీల భారం.. చూపండి మార్గం

› మొదటిపేజీ తరువాయి...

ఆహ్వానించింది. బీసీజీతో పాటు కేపీఎంజీ, ఈ అండ్ వై సంస్థలు పోటీలో నిలవగా, చివరకు బీసీజీ ఈ ప్రాజెక్టుకు ఎంపికైంది. అయితే, ఆరు నెలలపాటు సూచనలు చేయడానికి బీసీజీకి కర్ణాటక ప్రభుత్వం చెల్లిస్తున్న ఫీజు రూ.9.5 కోట్లు. ఈ మేరకు ఇంగ్లిష్ న్యూస్ వెబ్‌సైట్ 'మనీ కంట్రోల్' ఓ కథనంలో వెల్లడించింది.

ప్రభుత్వంలో మేధావులే లేరా??

ఆదాయ పెంపు సలహాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఓ ప్రైవేటు సంస్థపై ఆధారపడటమే కాకుండా, దీని కోసం పెద్దమొత్తంలో చెల్లించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అపార అనుభవం ఉన్న ఐఏఎస్‌లను కాదని, పెద్దమొత్తం చెల్లించి ఓ ప్రైవేటు కంపెనీపై సర్కారు ఆధారపడటం సమంజసం కాదని రిటైర్డ్ ఐఏఎస్ ఎంజీ దేవసహాయం అభిప్రాయపడ్డారు. ప్రైవేటు కంపెనీలు ఎక్కువ ఫీజును వసూలు చేయడమే గాక, అవి ఇచ్చే రిపోర్టులు వాస్తవ పరిస్థితులకు విరుద్ధంగా ఉంటాయని మండిపడ్డారు. కాంగ్రెస్ ఉచిత హామీలు ఆర్థిక వ్యవస్థకు ప్రమాదకరంగా మారాయన్నారు.

హామీల అమలు అసంపూర్ణమే

5 గ్యారెంటీల్లో 'ఉచిత విద్యుత్తు' హామీని ఇచ్చినట్టే ఇచ్చి ఛార్జీల పెంపునకు కాంగ్రెస్ ప్రభుత్వం తెరతీసింది. మహిళలకు ఆర్థిక భరోసా ఇస్తామన్న 'గృహలక్ష్మి' స్కీమ్‌కు కొత్త ఆంక్షలు జోడించింది. ఆడబిడ్డలకు ఉచిత బస్సు సర్వీసులంటూ ఊరించిన 'శక్తి' స్కీమ్‌లో వయసు, వృత్తి అంటూ కొత్త పరిమితులు తెచ్చింది. బస్సు సర్వీసులను తగ్గించింది. నిరుద్యోగులకు భృతి కల్పిస్తామన్న 'యువనిధి', పేదలకు ఉచిత బియ్యమన్న 'అన్నభాగ్య' ఇలా ప్రతీ స్కీమ్‌లోనూ కోతలు విధిస్తున్నది. దీంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇకచేసేదేమీలేక, హామీల అమలుకు అవసరమైన నిధులను ప్రజల నుంచే పిండుకోవాలని ట్యాక్స్‌ల వాతపెట్టిన సర్కారు.. చివరకు ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే మార్గాల కోసం బోస్టన్ కంపెనీని ఆశ్రయించింది.